# నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, ఆదివారం 13 ఏప్రిల్ 2025 | SANGAREDDY


## సామాన్యుడిలా..



చిన్నకోడూర్, ఏప్రిల్ 12: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో వడగండ్ల దాటికి నష్టపోయిన పంట పొలాలను శనివారం హరీశ్‌రావు పరిశీలించారు. ఈ క్రమంలో కరీంనగర్ రోడ్డు ఇబ్రహీంనగర్ ఇడ్లి బండి వద్ద హరీశ్‌రావు రైతులతో కలిసి టిఫిన్ చేశారు. రైతులను, స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ, వారితో ముచ్చటించారు. కామన్ మ్యాన్‌గా, సింప్లీగా తమ పక్కనే కూర్చుని హరీశ్‌రావు టిఫిన్ చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

## జలాలను చూసి.. హరీశ్‌రావు మురిసి..

చిన్నకోడూరు, ఏప్రిల్ 12: మండుటెండల్లో సైతం మత్తడి దుంకుతున్న గోనేపల్లి చెక్‌డ్యామ్‌ను చూసి హరీశ్‌రావు ఆనందానికి గురయ్యారు. సిద్దిపేట నియోజకవర్గంలో వడగండ్ల వర్షాలకి నష్టపోయిన పంటలను శుక్రవారం హరీశ్‌రావు పరిశీలించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గొనెపల్లి బ్రిడ్జి వద్ద మండుటెండల్లో మత్తడి దుంకుతున్న చెక్‌డ్యామ్‌ను చూసి హరీశ్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితానికి ఇది మరో సజీవ సాక్ష్యం అని పేర్కొన్నారు. ఎవరు ఏమన్నా కాళేశ్వరం ప్రాజెక్ట్ ముమ్మాటికి తెలంగాణకు జీవధార అని, పంట పొలాలకు ప్రాణధార అని పేర్కొన్నారు.



గోనెపల్లిలో చెక్‌డ్యామ్‌లో జలాలను చూసి సంతోషం వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

## ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



రాజగోపాల్‌పేటలో దెబ్బతిన్న పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- వడగండ్ల వానతో పంటలు దెబ్బ తిని రైతులు తీవ్రంగా నష్టపోయారు
- పోయిన యాసంగిలో జిల్లాలో 1350 ఎకరాల్లో నష్టం జరిగింది..
- ఇప్పటి వరకు నష్ట పరిహారం ఇవ్వలేదు..
- నంగునూరు మండలంలోనే 5300 ఎకరాల్లో పంట నష్టం
- కరోనా క్లిష్ట పరిస్థితుల్లోనూ కేసీఆర్ రైతుబంధు ఆపలేదు
- ఇన్‌పుట్ సబ్సిడీ, రైతుభరోసా ఇవ్వాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- దెబ్బ తిన్న పంటల పరిశీలన



రాజగోపాల్‌పేటలో రైతులను ఓదారుస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్/నంగునూరు, ఏప్రిల్ 12: ఇటీవల కురిసిన వడగండ్ల వర్షంతో రైతులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని, వెంటనే ప్రభుత్వం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని రాజగోపాల్‌పేటలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను శనివారం హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాగుల బాలమ్మ అనే మహిళా రైతు పంట నష్టం జరగడంతో తీవ్ర బాధలో ఉన్నట్లు తెలిపారు. ఓవైపు రుణమాఫీ కాక, రైతుబంధు కూడా ఆమెకు పడలేదన్నారు. సీఎం మాటలు నమ్మి రెండు రూ.లక్షలకు పైగా రుణమాఫీ ఉంటే మీది డబ్బులు కట్టిందని బాలమ్మ తనతో ఆవేదన వ్యక్తం చేసిందన్నారు. వానకాలం రైతుబంధు ఎగ్గొట్టి, యాసంగికి సగం మందికి కూడా రైతుభరోసా వేయలేదన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ప్రతి ఒక్కరికీ రైతుబంధు వేశారని, ఈ ప్రభుత్వం కోతలు పెడుతున్నదని మండిపడ్డారు. పోయిన యాసంగిలో సిద్దిపేట జిల్లాలో 1350 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. కానీ, ఇప్పటివరకు ప్రభుత్వం రూపాయి పరిహారం చెల్లించలేదన్నారు. రైతుల ఆరుగాల కష్టం నేలపాలైందన్నారు. నంగునూరు మండలంలోని 11 గ్రామాల్లో సుమారు 5300 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు జరిగిందని, సిద్దిపేట జిల్లాలోనే పది వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. 2500 ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు దెబ్బతిన్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు యాసంగి రైతుభరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. రైతుబీమా విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, చాలామంది చనిపోయిన రైతులకు రైతు బీమా అందడం లేదన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించడంతో పాటు వచ్చే వానకాలానికి రైతులకు ఉచితంగా విత్తనాలు అందించాలని కోరారు. కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదన్నారు. అటు రుణమాఫీ కాక, రైతుభరోసా రాక, ఇటు పంట నష్టపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వారికి ప్రభుత్వం అండగా నిలవాలని హరీశ్‌రావు కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, అధికారులు ఉన్నారు.

# కేసీఆర్ కావాలి.. రావాలి అంటున్న జనం

### కేసీఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్న తెలంగాణ



సిద్దిపేటలో రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేటలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- ప్రజల గుండెల్లో గుడికట్టుకున్న పార్టీ బీఆర్ఎస్
- రజతోత్సవ మహాసభకు పెద్ద ఎత్తున తరలుదాం
- 27న పల్లె పల్లెనా.. వార్డువార్డునా గులాబీ జెండా ఎగరాలి
- సిద్దిపేటలో సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- ఎంత స్పీడ్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందో.. అంతే స్పీడ్‌గా పడిపోయిందని విమర్శ

సిద్దిపేట, ఏప్రిల్ 12: పద్నాలుగేండ్ల పోరాటం... ఉద్యమ పంథా.. చరిత్ర ఉన్న గులాబీ జెండాకు పురుడు పోసిన గడ్డ సిద్దిపేట అని, 25 ఏండ్ల ఘనకీర్తి సిద్దిపేట మట్టి బిడ్డలకే ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఈనెల 27న జరిగే పార్టీ రజతోత్సవ సభ జనసమీకరణపై సిద్దిపేట పట్టణం, చిన్నకోడూరు మండలాల శ్రేణులతో శనివారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 27న పెద్ద ఎత్తున సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. పల్లె పల్లెనా జెండా ఎగురాలన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్న జెండా గులాబీ జెండా అని అన్నారు.

**మళ్లీ కేసీఆర్ కావాలి... రావాలంటున్న జనం**

కేసీఆరే కావాలి.. మళ్లీ రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని, కేసీఆర్ పాలనను ఇప్పుడు తెలంగాణ ప్రజలంతా గుర్తుచేసుకుంటున్నారని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ హయాంలో పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయని, తెలంగాణ అభివృద్ధిలో పయనించిందన్నారు. కేసీఆర్ తెలంగాణ జాతిపిత అన్నారు. 24 గంటల కరెంట్, రూ.2 వేల పింఛన్, రైతుబంధు, కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, హరితహారం వంటి పథకాలు, కార్యక్రమాలకు కేసీఆర్ కేరాఫ్ అని, కేసీఆర్ తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. వచ్చేది మళ్లీ కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం అని జోస్యం చెప్పారు. హైడ్రా పేరుతో పేదోళ్ల ఇండ్లు ధ్వంసం చేయడం, అడవులు ధ్వంసం చేసి మూగజీవాలను ఆగంచేయడం వంటి పనులకు రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ పెట్టిన బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ అన్నీ బంద్ చేసిన రేవంత్ పాలన చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని, ప్రజల కేసీఆర్ మళ్లీ రావాలి.. కావాలి అని కోరుతున్నారని హరీశ్‌రావు అన్నారు. నూకలు మిరే తినుండ్రి అన్న కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ నాటి మాటలు నేడు రేవంత్ రెడ్డి సన్న బియ్యం పేరుతో 40శాతం నూకలు ఇచ్చి ప్రజలకు తినిపించి నిజం చేస్తున్నాడని విమర్శించారు. ప్రజలకు సన్నబియ్యం ఇస్తామని చెప్పి నూకల బియ్యం ఇచ్చిన దౌర్భాగ్య సీఎం రేవంత్ అని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు ఇచ్చి ఎంత స్పీడ్‌గా వచ్చిందో.. ఎన్నికల తర్వాత ఎగవేతలతో అంతే స్పీడ్‌గా గ్రాఫ్ పడిపోయిందన్నారు.

**కొడంగల్ నుంచి వెటర్నరీ కళాశాల తెచ్చుకునుడే..**

సిద్దిపేట అభివృద్ధి కక్ష సాధింపుపై అసెంబ్లీలో మాట్లాడానని, నిధులు వచ్చేవరకు కొట్లాడుతానని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 15 నెలలుగా అభివృద్ధికి గ్రహణం పట్టిందని, ఆగిపోయిన పనులు తెచ్చేవరకు నిద్ర పోను అని అన్నారు. సిద్దిపేట అభివృద్ధి పనులు ఆపడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో వెటర్నరీ కళాశాల మంజూరైతే కొండగల్‌కి తరలించుకు పోయారని, మళ్లీ మా ప్రభుత్వం రాదా.. వచ్చిన రోజునే అదే కొడంగల్ నుంచి మళ్లీ సిద్దిపేటకు వెటర్నరీ కళాశాల తెస్తానన్నారు. సిద్దిపేటలో శిల్పారామం, నర్సింగ్ కళాశాల, చివరి దశకు వచ్చిన వెయ్యి పడకల దవాఖానలో క్యాన్సర్, గుండె విభాగాలకు సంబంధించిన పనులు ఆపివేశారన్నారు. మున్సిపల్‌లో రూ.20 కోట్ల రోడ్డు పనులు ఆపారని, సిద్దిపేట మీద ప్రభుత్వం కక్ష సాధిస్తున్నదని హరీశ్‌రావు ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కాముని శ్రీనివాస్, ముల్కల కనకరాజు, కుంటయ్య, పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, గుండు భూపేశ్, మోహన్‌లాల్, బూర మల్లేశం, కార్యకర్తలు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

## పటాన్‌చెరులో రజతోత్సాహం



బొల్లారంలో బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశమైన ఆదర్శ్‌రెడ్డి

- సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్న ఆదర్శ్‌రెడ్డి
- నిత్యం దిశానిర్దేశం చేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు
- భారీ జనసమీకరణకు ఏర్పాట్లు
- క్యాడర్‌లో నూతనోత్సాహం

పటాన్‌చెరు, ఏప్రిల్ 12: పటాన్‌చెరు బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తున్నది. బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా వెన్నవరం ఆదర్శ్‌రెడ్డిని ఇటీవల కేసీఆర్ నియమించారు. ఆదర్శ్‌రెడ్డి నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నారు. దీనికోసం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు. ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభకు భారీగా జన సమీకరణ చేసేందుకు ఆదర్శ్‌రెడ్డి నాయకత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి భారీసంఖ్యలో కార్యకర్తలను తరలించేందుకు మండల కేంద్రాలు, గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తున్నారు. రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి భారీ జనసమీకరణ చేసేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు నాయకులకు నిత్యం దిశానిర్దేశం చేస్తున్నారు. పటాన్‌చెరు, రామచంద్రపురం, అమీన్‌పూర్, జిన్నారం, గుమ్మడిదల మండలాల నుంచి భారీగా జన సమీకరణకు నేతలు కృషిచేస్తున్నారు. రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు మండల కేంద్రాలు, మున్సిపాలిటీలు, పట్టణాలు, గ్రామాల్లో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్నారు. బ్రిడ్జిలకు, గోడలకు, రోడ్లపక్కన, ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు వాల్ రైటింగ్ రాయిస్తున్నారు.

**భారీ జనసమీకరణ చేస్తాం..**



బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వరంగల్ రజతోత్సవ సభకు భారీగా జనసమీకరణ చేస్తాం. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి భారీగా నాయకులను, కార్యకర్తలను తరలించేందుకు గ్రామాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నాం. మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనలతో పార్టీకి నియోజకవర్గంలో పూర్వవైభవం తీసుకువచ్చేందుకు సైనికుల్లా పనిచేస్తున్నాం. ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై పోరాటం చేస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలను తెలిపి బీఆర్ఎస్‌ను బలోపేతం చేస్తాం. వరంగల్ సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారు. అందరి సహకారంతో రజతోత్సవ సభను విజయవంతం చేస్తాం.

– ఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి



బొల్లారంలో వాల్ రైటింగ్ రాస్తున్న ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి

## ఎకరాకు రూ. 25వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి

- జిల్లాలో 16 వేల ఎకరాల్లో పంట నష్టం
- కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించాలి
- ప్రభుత్వానికి మాటలు ఎక్కువ.. చేతలు తక్కువ
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



ఎల్లాయిపల్లెలో వరి పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు, ఏప్రిల్ 12: వడగండ్ల వానకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25 వేల ఇన్‌పుట్ సబ్సిడీ అంచాలని, అలాగే రైతులకు వానకాలం సాగుకు ఉచితంగా విత్తనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. చిన్నకోడూరు మండలంలోని గోనెపల్లి, ఇబ్రహీంనగర్, రాముని పట్ల, రామన్నపల్లి, ఎల్లాయిపల్లి, కొచ్చర్ల, కాసారంపల్లి, కొత్తపల్లి, చెలకలపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షం, వడగండ్ల వానకు నష్టపోయిన రైతుల పంటలు, మామిడి తోటలు, కూరగాయల పంటను శనివారం ఆయన సందర్శించి రైతులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. వడగండ్ల వర్షంతో నష్టపోయి రైతులు చాలా ఆందోళనలో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మాటలు ఎక్కువ, చేతలు తక్కువ అని విమర్శించారు. చిన్నకోడూరు మండలంలో ఇప్పటిదాకా 5300కి పంట రుణమాఫీ అయ్యిందని, మరో 7352 మందికి రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. రైతుబీమా పథకం అమలు కావడం లేదన్నారు. పంటల బీమా పత్తాలేకుండా పోయిందన్నారు. జిల్లాలోని వడగండ్ల వానకు 16 వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందన్నారు. పంట చేతికొచ్చే సయమానికి నష్టం జరిగి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి కాలువల ద్వారా నీళ్లు ఇచ్చారని, రేవంత్ ప్రభుత్వం మాత్రం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కనకరాజు, సదానందంగౌడ్, సీనియర్ నాయకులు మేడికాయల వెంకటేశం, ఏంరెడ్డి భూమిరెడ్డి, కొండం రవీందర్‌రెడ్డి, ఉమేశ్‌చంద్ర, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.



ఎల్లాయిపల్లిలో నేలరాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

## బీఆర్ఎస్ హయాంలో ఆలయాల అభివృద్ధి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

మనోహరాబాద్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ హయాంలో ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేశామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. శనివారం కూచారంలో జరిగిన హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కూచారం హనుమాన్ ఆలయానికి రూ. 22 లక్షలు మంజూరు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అంతకుముందు ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్‌తో, నాచారం గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా కూచారం గ్రామ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు కవిత చేరుకుని పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి మాదిరా... సవతి తల్లి మీదిరా అంటూ కాంగ్రెస్ పార్టీనుద్దేశించి విమర్శించారు. అనంతరం నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్నారు. గ్రామంలోని కోదండ రామాలయాన్ని, హనుమాన్ దేవాలయాన్ని కవిత సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మనోహరాబాద్ మాజీ ఎంపీపీ పురం రవి నవనీత ముదిరాజ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దాసరి నరేశ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు నాయిని ఉదయ్ రంజన్ గౌడ్, అనంతారం వీరేశ్ గౌడ్, మంగ్యా నాయక్, నాయిని నందు గౌడ్, మొద్దు ప్రేమ్ కుమార్, అర్కల రమేశ్ ముదిరాజ్, యావపురం కృష్ణ, రాజునాయక్, తొంట శంకర్, చింపుల మురళి, వడ్డె యాదగిరి పాల్గొన్నారు.



హనుమాన్ జయంతి సందర్భంగా మనోహరాబాద్ మండలంలోని కూచారం హనుమాన్ దేవాలయంలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత

## వరంగల్ సభను జయప్రదం చేయాలి

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి




కొల్చారంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కొల్చారం, ఏప్రిల్ 12: ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సంగాయిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మండల నాయకులతో కలిసి బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన గ్రామానికి చెందిన దివ్యాంగుడు బ్యాక మల్లయ్య తన నెల పింఛను రూ.4 వేలు స్వచ్ఛంద విరాళం ప్రకటిస్తూ ఎమ్మెల్యే చేతికి అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనకలను సాకారం చేసిన బీఆర్ఎస్ పార్టీపై మల్లయ్య చూపిన అభిమానాన్ని కొనియాడారు. స్వచ్ఛందంగా విరాళం ఇవ్వడంపై ఆయనను అభినందించారు. మల్లయ్య ఇచ్చిన విరాళాన్ని కేసీఆర్‌కు అందజేస్తానని తెలిపారు. వరంగల్ మహాసభ తెలంగాణ పండుగ అని ఆమె అభివర్ణించారు. బీఆర్ఎస్ పాలనలో అన్నివర్గాల సంక్షేమానికి కేసీఆర్ కృషిచేశారన్నారు. కాంగ్రెస్ 16 నెలల పాలనలో అభివృద్ధి ఆగిపోయిందని, సంక్షేమం అమలు కావడం లేదన్నారు. మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుతున్నట్లు తెలిపారు. 27న జరిగే వరంగల్ బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గౌరీశంకర్, యువత అధ్యక్షుడు సంతోష్ రావు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ అరిగె రమేశ్, మాజీ ఎంపీపీ మంజూల కాశీనాథ్, ఇంద్రసేనారెడ్డి, విష్ణు వర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మల్లేశం, రాజాగౌడ్, దుర్గేశ్ పాల్గొన్నారు.

## గులాబీ పండుగపై వాల్ రైటింగ్

దుబ్బాక, ఏప్రిల్ 12: ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ శ్రేణుల జోరుగా ప్రచారం చేస్తున్నారు. మారుమూల పల్లెల్లో సైతం ప్రచారం జోరందుకున్నది. అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిన్ననిజాంపేటలో శనివారం దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాష్ ఆధ్వర్యంలో వాల్ రైటింగ్ చేపట్టారు. గులాబీ జెండా 25 ఏండ్ల పండుగ అని, తెలంగాణకు కేసీఆర్ శ్రీరామ రక్ష అంటూ నినాదాలతో కూడిన వాల్ రైటింగ్ చేశారు. ఛలో వరంగల్ ..దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో భారీ సంఖ్యలో తరలివెళ్లి, సభను విజయవంతం చేయాలని కోరుతూ వాల్ రైటింగ్‌తో పీఏసీఎస్ చైర్మన్ కైలాష్ ప్రచారం చేస్తున్నారు.




చిన్ననిజాంపేటలో రజతోత్సవ సభకు తరలిరావాలని వాల్ రైటింగ్

## అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- కంది జైలు నుంచి హెచ్‌సీయూ విద్యార్థి సంఘం నేత విడుదల

కంది, ఏప్రిల్ 12: హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలని ఆందోళన చేపట్టిన వర్సిటీ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకుడు ఎర్రం నవీన్ శనివారం ఉదయం కంది సెంట్రల్ జైల్ నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఎస్ఎఫ్ఐ నాయకులు జైలు వద్ద నవీన్‌కు స్వాగతం పలికారు. అనంతరం కందిలోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌సీయూ 400ఎకరాల భూములను వేలం వేయడాన్ని ప్రభుత్వం ఆపాలని జరిగిన ఆందోళనలో నవీన్‌ను మార్చి 30న పోలీసులు అరెస్టు చేశారు. మార్చి 31న కంది సెంట్రల్ జైలుకు తరలించగా, 12రోజుల తర్వాత నవీన్ విడుదలయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. స్వాగతం పలికినవారిలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు సీపీఎం జిల్లా నాయకులు జయరాజు, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్యం, వ్యాకాస జిల్లా కార్యదర్శి నర్సింలు, హెచ్‌సీయూ విద్యార్థి సంఘ నాయకులు దీపక్, అంతేక్, దిలీప్, కార్తీక్ పాల్గొన్నారు.



కంది సెంట్రల్ జైలు నుంచి విడుదలైన నవీన్‌కు స్వాగతం పలుకుతున్న సీపీఎం జిల్లా నాయకులు, హెచ్‌సీయూ విద్యార్థి సంఘ నాయకులు